

# బాలిక అబార్షన్‌కు బాంబే హైకోర్టు అనుమతి

## 26 వారాల గర్భం తొలగింపునకు గ్రీన్ సిగ్నల్

**ప్రజానావ, ముంబై:** లైంగికదాడికి గురై గర్భం దాల్చిన 13 ఏళ్ల బాలికకు గర్భస్రావం చేయించుకోవడానికి బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ అనుమతినిచ్చింది. వైద్య నిపుణుల కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బాలిక శారీరక, మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని కల్మేశ్వర్‌కు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై, ఆమె సొంత సోదరుడే (16) ఏడాది కాలంగా లైంగికదాడి చేస్తున్నాడు. ఇటీవల బాలిక ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె గర్భవతి అని తేలింది. కుటుంబ సభ్యులు ఆమెను విచారించగా, సోదరుడి అకృత్యం బయటపడింది. ప్రస్తుతం బాలిక 26 వారాల గర్భంతో ఉండటంతో, గర్భస్రావానికి అనుమతి కోరుతూ ఆమె తండ్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. చట్ట ప్రకారం గర్భస్రావ గడువు దాటినందున, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల నిపుణులతో కూడిన ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశారు. బాలిక శారీరక సామర్థ్యాన్ని, పిండం పరిస్థితిని పరీక్షించిన బోర్డు, గర్భస్రావానికి అనుకూలంగా నివేదిక ఇచ్చింది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం బాధిత బాలికకు తక్షణమే గర్భస్రావం చేయాలని ఆదేశించింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హృషికేశ్ మరాఠే తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడైన సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేసి బాలనేరస్థుల హోంకు తరలించారు. కాగా, బాధితురాలికి ప్రభుత్వం తరపున 'మనోధైర్య' పథకం కింద ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని జిల్లా బాలల రక్షణ అధికారి ముష్తాక్ పఠాన్ వెల్లడించారు. బాలిక ఆరోగ్యం, భవిష్యత్తు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# నిత్య పెళ్లికొడుకు అరెస్ట్

## ఇస్రో శాస్త్రవేత్త అంటూ మోసం

## ఉన్నత విద్యావంతులైన మహిళలే లక్ష్యం

**ప్రజానావ, ముంబై:** మ్యాట్రిమోనియల్ సైట్‌లలో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, ఉన్నత విద్యావంతులైన మహిళలను పెళ్లి పేరుతో మోసం చేస్తున్న ఒక అంతర్రాష్ట్ర మోసగాడిని నవీ ముంబై పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. అలీబాగ్‌కు చెందిన ఆదర్శ్ ప్రశాంత్ మాత్రే అనే వ్యక్తి, తన సహాయకుడు ప్రేమ్ కిరణ్ మాత్రేతో కలిసి ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు ఆదర్శ్ తన పేరును 'స్వప్నిల్ వరులే'గా మార్చుకుని, తానే ఒక ఇస్రో శాస్త్రవేత్తనని లేదా పీడబ్ల్యూడీ అధికారిని అని చెప్పుకుంటూ షాదీ.కాం, భారత్ మ్యాట్రిమోనీ వంటి సైట్లలో ప్రొఫైల్స్ పెట్టేవాడు. మెర్సిడెస్ కారులో తిరుగుతూ, ఫైవ్ స్టార్ హోటళ్లలో బస చేస్తూ తాను చాలా సంపన్న కుటుంబానికి చెందిన వాడిగా నటించేవాడు. దీనిని నమ్మి దగ్గరైన మహిళలతో శారీరక సంబంధం పెట్టుకోవడమే కాకుండా, భూమి కొనుగోలు పేరుతో వారిని పర్సనల్ లోన్లు తీసుకోమని బలవంతం చేసి లక్షలాది రూపాయలు కాజేసేవాడు. బాధిత మహిళల నుండి దోచుకున్న సొమ్ముతో నిందితుడు గోవాలోని ఫైవ్ స్టార్ హోటళ్లలో విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. అక్కడ ఒక ప్రముఖ క్యాసినోలో 'ప్రైమ్ మెంబర్‌షిప్' కూడా పొందాడు. పోలీసులు నిందితుడి నుంచి రూ. 89 లక్షల 40 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఐదుగురు మహిళల నుండి దాదాపు రూ. 97 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. సామాజిక అవమానానికి భయపడి చాలా మంది బాధితులు ఫిర్యాదు చేయడం లేదని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడి వద్ద ఇస్రో శాస్త్రవేత్తగా, పీడబ్ల్యూడీ అధికారిగా చలామణి అయ్యేందుకు అవసరమైన నకిలీ ఐడీ కార్డులు, ఆధార్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై నవీ ముంబై, థానే, ముంబై, పూణేలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మోసం, ఐటీ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. కోర్టు నిందితులకు మార్చి 4 వరకు పోలీస్ కస్టడీ విధించింది. ఆన్‌లైన్ మ్యాట్రిమోనియల్ సైట్లలో పరిచయమయ్యే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నవీ ముంబై పోలీసులు మహిళలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా వివాహం పేరుతో డబ్బు లేదా రుణం కావాలని ఒత్తిడి చేస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# పట్టాభిషేకానికి హాజరైన చింతోజు



**ప్రజానావ, సిరిసిల్ల :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో కందిమల్లయ్య పల్లెలో గత మూడు రోజులుగా బ్రహ్మంగారి మఠానికి 12వ తరం పీఠాధిపతిగా నియమితులైన వెంకటాద్రి స్వామి పట్టాభిషేకానికి ఆహ్వాన పత్రికను మానేరు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ చింతోజు భాస్కర్ రమాదేవి దంపతులకు అందజేశారు.. ఈ సందర్భంగా శుక్రవారం శుక్రవారం వీరిద్దరూ హాజరై పట్టాభిషేకం మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చింతోజు భాస్కర్ దంపతులు మాట్లాడుతూ ఇలాంటి అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని కొనియాడారు. ఈ మహోత్సవానికి దేశ దేశాల నుండి ఆధ్యాత్మిక పీఠాధిపతులు, మఠాధిపతులు, వేద పండితులు, భక్తులు హాజరయ్యారు.

# బాధ్యతగా రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

- డ్రైవర్లు నియమాలు తప్పక పాటించాలి
- మద్యం సేవించి డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజానావ, సిరిసిల్ల :** డ్రైవర్ల భద్రతే ప్రజల భద్రతని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ ఆలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అశ్విని హాస్పిటల్స్ సహకారంతో మండల పరిధిలోని వివిధ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈవైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై శిబిరాన్ని ప్రారంభించి, అవసరమైన డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి వాహనాదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. దీర్ఘకాలం వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్పష్టమైన చూపు లేకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనం నడిపే సందర్భాల్లో తప్పక హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు అలసటగా ఉన్నప్పుడు వాహనాన్ని పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవాలని, ప్రతి మూడు నెలలకొకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అన్ని మండల కేంద్రాల్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎస్పీ అశ్విని హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ అభినెయ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఏంఎస్‌ఎంఈ పాలసీని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హనుమంతు
- ర్యాంపు ప్రాజెక్టుపై అవగాహన




**ప్రజానావ, సిరిసిల్ల :** ఏంఎస్‌ఎంఇ పాలసీ ముఖ్యాంశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, పెట్టుబడి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం (డిఐసి) రాజన్న సిరిసిల్ల జనరల్ మేనేజర్ టి. హనుమంతు వెల్లడించారు. డిఐసి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ర్యాంపు ప్రాజెక్ట్ కింద ఈడీసీ టీం ద్వారా ఎంఎస్‌ఎం ఈ పాలసీపై శుక్రవారం ఒక రోజు అవగాహన కార్యక్రమం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ పాలసీ ముఖ్యాంశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, పెట్టుబడి, ఉపాధి అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పరిశ్రమల స్థాపన, విస్త రణ, అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి అతిథి అధ్యాపకులుగా ఎం. వెంకటరమణ (ఎఫ్ఎల్‌సి), బి. విజయకుమార్ (జెడ్ ఫెసిలిటేటర్) హాజరై ఎమ్ఎస్ఎంఈ పాలసీ ద్వారా పరిశ్రమలకు లభించే ప్రయోజనాలు, ఆర్థిక సహాయాలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారవేత్తలు, యువ పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమ ప్రారంభించాలనుకునే అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈడీసి మేనేజర్ కె. జయంత్, ఈడిసి అసిస్టెంట్ మేనేజర్ టి. వెంకటశివసాయి సమన్వయంతో నిర్వహించారు.

# పీఎంశ్రీ కార్యక్రమాల అమలు పరిశీలన






**ప్రజానావ, సిరిసిల్ల :** పీఎంశ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్‌కుమార్ శుక్రవా రం పరిశీలించారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలను సందర్శించారు. మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయంలో పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా పాఠశాలలో పూల మొక్కను నాటారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని ఆయా స్కూల్ లలో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచిం చారు. స్పోర్ట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను అభినందించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పీఎంశ్రీ అమలు పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ విక్రమ్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ దబ్బెడ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. పెళ్లి పేరిట మోసం

## నగదు, బంగారంతో వ్యక్తి పరారు




**ప్రజానావ, వేములవాడ:** సోషల్ మీడియా పరిచయాలను నమ్మి అపరిచిత వ్యక్తులతో సన్నిహితంగా ఉండటం ఎంత ప్రమాదకరమో నిరూపించే ఘటన వేములవాడలో వెలుగుచూసింది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వ్యక్తి పెళ్లి పేరుతో నమ్మించి, ఓ మహిళ నుండి బంగారం, నగదు దొంగిలించి పరారయ్యాడు. ధర్మపురి పట్టణానికి చెందిన బాధితురాలికి విజయవాడకు చెందిన వంశీ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో ఇద్దరూ కలిసి వేములవాడకు వచ్చారు. అక్కడ పట్టణంలోని మహేశ్వరి పరమేశ్వర లాడ్జీలో గది అద్దెకు తీసుకోగా, మహిళ బాత్రూంలో ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని వంశీ ఆమె బ్యాగులోని మూడు తులాల బంగారు గొలుసు, రూ.10,000 నగదును దొంగిలించి అక్కడి నుండి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సదరు లాడ్జ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. గది అద్దెకు ఇచ్చే సమయంలో అతిథుల నుండి ఎటువంటి ఆధార్ కార్డు కానీ, ఇతర గుర్తింపు పత్రాలు కానీ సేకరించలేదని, రిజిస్టర్ నిర్వహణ కూడా సక్రమంగా లేదని తేలింది. ఈ నిర్లక్ష్యానికి బాధ్యునిగా చేస్తూ లాడ్జ్ యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో వేములవాడ పట్టణ సీఐ అన్ని లాడ్జీలు, గెస్ట్ హౌస్ నిర్వాహకులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. గదులు ఇచ్చే ముందు తప్పనిసరిగా గుర్తింపు పత్రాలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు మెయింటైన్ చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# ఈ పండ్లతో క్యాన్సర్ రాదు

ప్రస్తుతం భారతీయులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లల్లో క్యాన్సర్ కూడా ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందనే చెప్పవచ్చు. జీవన విధానంలో మార్పులు, ధూమపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, రేడియేషన్ కు ఎక్కువగా గురవ్వడం, రసాయనాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ఈ వ్యాధికి సరైన మందు లేదనే విషయం మనందరికీ తెలిసిందే. కనుక వ్యాధి బారిన పడి బాధపడడానికి బదులుగా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో మార్పులు చేసుకోవడం మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.మామిడి పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల అసాధారణ కణాల పెరుగుదల వేగం తగ్గుతుంది. అలాగే నేరేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ప్రొలిఫెరేటివ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి హానికారక కణాల వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి. ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కూడా మనం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఉసిరిలో ప్రీక్లినికల్ నమూనాలు ఉంటాయని వీటి సారం క్యాన్సర్ పై ఆశాజనక ప్రభావాలను చూపించదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కోకుమ్ అనే పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. మంకీ జాక్ ఫ్రూట్ పండ్లు కూడా క్యాన్సర్ అభివృద్ధిని తగ్గిస్తాయి. ఈ పండ్లు మనలో చాలా మందికి తెలియవు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ క్యాన్సర్ వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి. ఈ విధంగా ఈ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాప్తి తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తగ్గుతాయి.

# ఈ 3 ఫ్రూట్ జ్యూసులు రోజూ తాగుతున్నారా..

## షుగర్ సహా ఈ సమస్యలు..!

పండ్ల రసం తాగడం చాలా సాధారణ విషయం. కానీ పోషకాహార నిపుణులు ఎప్పుడూ జ్యూస్‌లు తాగడాన్ని నిషేధించాలని సూచిస్తారు. కారణం, ఈ జ్యూస్‌లలో చక్కెర తప్ప ఎక్కువ పోషకాలు ఉండవు. మీరు ప్రతిరోజూ పండ్ల రసం తాగుతుంటే అది ఫ్యాటీ లివర్, షుగర్ స్పైక్, %ాజూణ%, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి వ్యాధులకు దారితీస్తుంది. ముఖ్యంగా ఈ ఆరోగ్యానికి శ్రేష్ఠమైనవిగా భావించే ఈ 3 రకాల పండ్లను డైలీ జ్యూస్ రూపంలో తాగితే పోషకాలు అందకపోగా హానికరంగా మారతాయి. మరి, ఆ పండ్లు ఏవి? ఎందుకు జ్యూస్ చేసుకుని తాగకూడదో ఈ కథనంలో..

**పండ్ల రసం ఎందుకు తాగకూడదు?**

పండ్ల రసం తాగకూడదు అని పోషకాహారాలు నిపుణులు తరచూ సూచించడానికి గల అతి పెద్ద కారణం ఫైబర్. రక్తంలో చక్కెర స్థాయిని సమతుల్యం చేయడానికి, చక్కెర పెరుగుదలను నివారించడానికి, పేగు ఆరోగ్యాన్ని సంరక్షించడానికి ఫైబర్ చాలా ముఖ్యమైనది. పండ్లలో లభించే కానీ, పండ్ల నుంచి రసం తీసే క్రమంలో పిప్పి ద్వారా ఫైబర్ చెత్తపాలవుతుంది. మిగిలిన దాన్ని జ్యూస్ రూపంలో తాగినా ఆరోగ్యానికి ఎటువంటి ప్రయోజనాలు అందవు. మంచిది కదా అని ప్రతిరోజూ తాగితే సమస్యలు తప్పవు. ఇంతకీ, ఏ 3 పండ్ల రసాలను రోజూ తాగకూడదో తెలుసుకోండి.

**నారింజ రసం**

నారింజ పండును పూర్తిగా తినాలి. దాన్ని ఎప్పుడూ రసం తయారు చేసి తాగకూడదు. ఎందుకంటే, నారింజలో గుజ్జు పరిమాణం తక్కువగా ఉంటుంది. దాన్నుంచి మనం దాని రసం తీసినప్పుడు అధిక మొత్తంలో కేలరీలు, గాఢమైన సహజ చక్కెర మాత్రమే మిగిలి ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని పెంచడంలో సహాయపడుతుంది. మరోవైపు, రసం తీయడం వల్ల దానిలోని ఫైబర్ అంతా బయటకు పోతుంది. ఇది శరీరానికి అందాల్సిన అతి ముఖ్యమైన పోషకం.

**దానిమ్మ రసం**

దానిమ్మ రసం చాలా ప్రాచుర్యం పొందింది. శరీరంలో రక్త ప్రసరణను పెంచడానికి లేదా వ్యాధి నుండి కోలుకునే వ్యక్తిని ఆరోగ్యంగా ఉంచడానికి ప్రజలు తరచుగా దానిమ్మ రసం తాగుతారు. ఈ రసం యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లతో నిండి ఉంటుంది. కానీ, దానిమ్మ రసం తాగే బదులుగా దానిమ్మ గింజలను విత్తనాలతో పాటు తినండి. ఇది శరీరానికి గరిష్ఠ ఫైబర్‌ను అందిస్తుంది.

**బీట్‌రూట్ రసం**

పండ్ల మాదిరిగానే బీట్‌రూట్ రసం తాగడం కూడా మంచిది కాదు. మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే బీట్‌రూట్ తినండి. తద్వారా మీరు ఫైబర్‌తో పాటు అన్ని యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లను పొందవచ్చు. బీట్‌రూట్ రసంలో ఆక్సలేట్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.







# అసలు రోజుకు ఎన్ని కప్పుల కాఫీని తాగాలి?

## దీంతో కలిగే లాభాలు ఏమిటి?



రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా మంది టీ, కాఫీ వంటి పానీయాలను సేవిస్తుంటారు. టీ ప్రియులు కొందరు ఉంటే, కాఫీ అంటే ఇష్టపడే వారు కొందరు ఉంటారు. అయితే కాఫీ గురించి కొన్ని విషయాలను వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం మంది తాగుతున్న పానీయాల జాబితాలో కాఫీ మొదటి స్థానంలో ఉంది. కాఫీని సేవించడం వల్ల ఉదయాన్నే శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. బద్దకం పోతుంది. చురుగ్గా, యాక్టివ్‌గా ఉంటారు. కాఫీలో అనేక సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కాఫీలో కెఫీన్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. ఇది నిద్రను ప్రేరేపించే అడినోసిన్ అనే హార్మోన్ విడుదలను అడ్డుకుంటుంది. అందువల్ల కాఫీని సేవిస్తే నిద్ర రాదు. మత్తు వదిలిపోతుంది. కాఫీని సేవించడం వల్ల డోపమైన్, నోరెపైన్‌ఫ్రైన్ అనే న్యూరో ట్రాన్స్‌మిటర్లు ఉత్పత్తి అవుతాయి. ఇవి అప్రమత్తతను పెంచుతాయి. మూడ్ మారేలా చేస్తాయి.

**కొవ్వు కరిగేందుకు..**

కాఫీని సేవించడం వల్ల శరీరంలో అడ్రినలిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరంలో ఉన్న కొవ్వు కరుగుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది. అందుకనే చాలా మంది అథ్లెట్లు వర్కవుట్ చేసేందుకు ముందుగా కాఫీని సేవిస్తుంటారు. దీంతో ఎక్కువ సేపు వ్యాయామం చేసినా శ్రమ అనేది అనిపించకుండా ఉంటుంది. నీరసం, అలసట ఉండవు. అధిక బరువు తగ్గాలనుకుంటున్న వారికి కూడా కాఫీ ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. కాఫీ వల్ల మెటబాలిజం పెరిగి క్యాలరీలు ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. ఫలితంగా అధిక బరువు తగ్గుతారు. అయితే కాఫీలో చక్కెర కలపకుండా తాగాలి. లేదా బ్లాక్ కాఫీని తాగాలి. దీని వల్ల బరువును సులభంగా తగ్గించుకోవచ్చు.

**షుగర్ ఉన్నవారు..**

కాఫీలో అనేక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. క్లోరోజెనిక్ యాసిడ్, క్వినైడ్స్ ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు రోజూ కాఫీని చక్కెర లేకుండా తాగాలి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. కాఫీలో ఉండే కెఫీన్ అనేక నాడీ సంబంధ సమస్యలను సైతం తగ్గిస్తుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా పార్కిన్సన్స్, అల్జీమర్స్ వంటి వ్యాధుల నుంచి బయట పడేలా చేస్తుంది. కాఫీని తాగడం వల్ల లివర్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని తేలింది. అలాగే ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ ఉన్నవారు కాఫీని తాగుతుంటే ఫలితం ఉంటుంది.

**ఎన్ని కప్పులు తాగాలి..?**

కాఫీని రోజూ పరిమిత మోతాదులో సేవిస్తుంటే గుండె పోటు రాకుండా చూసుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే కాఫీని రోజుకు ఎన్ని కప్పులు సేవించాలి..? అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు వైద్యులు ఏమని సమాధానం చెబుతున్నారంటే.. ఒక కప్పు కాఫీలో సుమారుగా 100 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుంది. మన శరీరానికి రోజుకు 400 మిల్లీగ్రాముల వరకు కెఫీన్‌ను తీసుకోవచ్చు. అంతకు మించకూడదు. కనుక రోజుకు 4 కప్పుల వరకు కాఫీని తాగవచ్చు. అయితే కాఫీని 4 కప్పులు తాగితే మాత్రం ఇక టీ తాగకూడదు. ఎందుకంటే అందులోనూ కెఫీన్ ఉంటుంది కనుక శరీరంలో కెఫీన్ మోతాదు పెరుగుతుంది. టీ, కాఫీ ఏది తాగినా సరే రోజువారి కెఫీన్ మోతాదు మించకుండా చూసుకోవాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి.

# జీడిపప్పు తింటే సన్నగా అవుతారా.!



చాలా మందికి బిజీ షెడ్యూల్ కారణంగా జిమ్‌కు వెళ్లి ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం సాధ్యం కాదు. అయితే, ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారికి డ్రై ఫ్రూట్స్ మంచి పరిష్కారమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా, జీడిపప్పు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటున్నారు. అయితే, చాలా మంది వీటిని తింటే బరువు తగ్గుతారని అంటారు. కానీ, ఇందులో నిజమెంతో ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్య నిపుణుల ప్రకారం, జీడిపప్పు గింజలు మన శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. జీడిపప్పులో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ డి, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలు మన శరీరంలోని వివిధ వ్యవస్థల పనితీరును పెంపొందించడంలో సహాయపడతాయి.

**అతిగా తినకుండా..**

జీడిపప్పులోని కేలరీలు ఆరోగ్యకరమైనవి. అవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. జీడిపప్పులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మిమ్మల్ని కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి. ఇది అతిగా తినకుండా నిరోధిస్తుంది. ఇది మీ బరువును నియంత్రణలో ఉంచుతుంది.

**రోగనిరోధక శక్తి బలోపేతం**

జీడిపప్పులోని మెగ్నీషియం, కాల్షియం.. ఎముకలు, కండరాలను బలోపేతం చేస్తాయి. ఇది వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడకుండా నిరోధిస్తుంది. జీడిపప్పులో ఉండే విటమిన్లు, ఖనిజాలు మన శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇది వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది.

**చర్మానికి మేలు**

జీడిపప్పులోని జింక్, విటమిన్ ఇ వంటి పోషకాలు చర్మానికి మేలు చేస్తాయి. ఇవి చర్మాన్ని తాజాగా, యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. జీడిపప్పును రోజూ తినడం వల్ల ముఖానికి సహజమైన మెరుపు వస్తుంది. ఇది మీరు పెద్దయ్యాక కూడా యవ్వనంగా కనిపించడంలో సహాయపడుతుంది.

